టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: సీపీ

మామిళ్లగూడెం, మార్చి 19: ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు టెన్త్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సునీల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 97 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్–2023 (భారతీయ నాగరిక్ సురాక్షా సంహిత)ను అమలు చేయనున్నట్లు వివరించారు.

పది పరీక్షల ఉమ్మడి జిల్లా అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయి

ఖమ్మం అర్బన్, మార్చి 19 : పదో తరగతి పరీక్షల ఉమ్మడి జిల్లా అబ్జర్వర్‌గా ఎస్.విజయలక్ష్మీబాయిని నియమించారు. ప్రస్తుతం విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టర్ హోదాలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (సైట్) డైరెక్టర్‌గా ఆమె పనిచేస్తున్నారు. గతంలో ఖమ్మం డీఈవోగా మూడేళ్లపాటు పనిచేశారు. అనంతరం పదోన్నతిపై హైదరాబాద్‌లో ఆర్జేడీగా వెళ్లారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అబ్జర్వర్‌గా మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె 'నమస్తే'తో మాట్లాడుతూ గురువారం ఖమ్మం చేరుకొని రెండు జిల్లాల డీఈవోలతో మాట్లాడి, పరీక్షలు సజావుగా జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. పామాయిల్ తోట దగ్ధం

అధికారుల తీరుపై మండిపడుతున్న బాధిత రైతులు

కాలి బూడిదైన పామాయిల్ తోట

రఘునాథపాలెం, మార్చి19: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపమైంది. బుధవారం మధ్యాహ్నం వీచిన గాలులకు మండలంలోని బావోజీతండాలో పామాయిల్ తోటపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో రైతు అక్కడ లేకపోవడంతో మంటలు పామాయిల్ తోట మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఒక తోట నుంచి పక్కనే ఉన్న మరోరైతు పామాయిల్ తోట మొత్తం 9ఎకరాలు పూర్తిగా దగ్ధమైంది. పామాయిల్ గెలలతో ఉన్న తోట మరికొద్దిరోజుల్లో అమ్ముకునేందుకు సిద్ధమవుతుండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి చేజారిపోవడంతో బాధిత రైతులు శివలాల్, బానోతు ప్రమీల కన్నీరుమున్నీరు అవుతున్నారు. అధికారులను కలిసి విద్యుత్ తీగలను తొలగించాలని దరఖాస్తు పెట్టినా పట్టించుకోకపోవడంతో నష్టం జరిగిందని వాపోతున్నారు.

డాక్టరేట్ సాధించిన అంధుడు సాయిచరణ్

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : కాకతీయ యూనిర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకుడు వడ్డేపల్లి సాయిచరణ్ డాక్టరేట్ సాధించారు. చరిత్ర విభాగం ఆచార్యులు తాళ్లపల్లి మనోహర్ పర్యవేక్షణలో 'హైదరాబాద్ రాజ్యంలో వైద్య, ఆరోగ్య సేవలు' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా బల్లేపల్లికి చెందిన సాయిచరణ్ చిన్నవయసులోనే సరైన చికిత్స అందక రెండు కళ్లు కోల్పోయాడు. అయినా మొక్కవోని దీక్షతో హైస్కూల్ విద్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖమ్మంలో, ఎస్వీ జూనియర్ కాలేజీ కోదాడలో ఇంటర్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఖమ్మంలో డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ హిస్టరీ పూర్తిచేశారు. తాను విద్య అభ్యసిస్తున్న సమయంలో తన స్నేహితుడు నాగేశ్వర్‌రావు, తన భార్య నాగరాణి స్క్రైబ్‌లుగా వ్యవహరించే వారని మనోహర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చరిత్ర లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సాయిచరణ్‌ని చరిత్ర విభాగ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **వైరా బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొను **లకావత్ లక్ష్మ, S/o: పుల్సింగ్, వయస్సు: 52సం||లు, నివాసం:** ఇ.నెం. 4-68/A, జన్నారం గ్రామం, ఏన్కూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: 1వ పార్టీవారు : **లకావత్ లక్ష్మ గారి** వాటా విలువ రూ.9,00,000/-లు, ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా పరిషత్, ఏన్కూరు మండల పరిషత్, జన్నారం యస్‌బీ కాలనీ గ్రామ పంచాయితీలో చేరిన జన్నారం గ్రామ రెవిన్యూ రికార్డుకు చెందిన గృహసహిత నివేశన స్థలము విస్తీర్ణం చ||గ|| 256.13లు, ఇందుకు సరియగు చ||మీటర్లు 214.15 అందుగల ఇంటి నెంబరు 3-68, అసెస్మెంట్ నెంబరు. 29 గా గల గృహము యొక్క ఏ.సి.సి. నిర్మాణ వైశాల్యము చ||అ|| 810.0లు, అట్టి గృహమునకు గల విద్యుత్ సర్వీసు మీటరు విద్యుత్ నీటిగా ఫిట్టింగులతో గల గృహము యొక్క వార్షిక అద్దె విలువ రూ. 8,000/-లు గృహము యొక్క వయస్సు 10సం||లు, **డాక్యుమెంట్ నెం. 2162/2024,** అట్టి గృహ సహిత నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : పామర్తి నాగేశ్వరరావుగారి గృహము, **పడమర** : గ్రామ పంచాయితీ రోడ్డు, **ఉత్తరము** : లకావత్ శ్రీను గారి గృహము, **దక్షిణము** : బాణోత్ శ్రీను గారి గృహము.

జి.హరేందర్ రెడ్డి

అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

లారీ డ్రైవర్ ప్రాణాలు కాపాడిన పోలీసులు

పెనుబల్లి, మార్చి19: గోకవరం నుంచి మొక్కజొన్న లోడ్‌తో వెళ్తున్న లారీడ్రైవర్ మొగళ్ల కృపారావు మండలంలోని వీ.ఎం. బంజర పోలీస్‌స్టేషన్ సమీపంలో లారీని ఆపి విశ్రాంతి తీసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున కృపారావుకు గుండెపోటు రావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు స్పెషల్‌బ్రాంచ్ పుల్లారావు, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుల్ వీరరాఘవు పోలీస్ వాహనంలో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కారేపల్లి, మార్చి 19: పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో జయరాజు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ కారేపల్లిలో 240 మంది, జిల్లా పరిషత్ కోట్లగూడెంలో 160మంది, తెలంగాణ మోడల్ పాఠశాలలో 140మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

పశువైద్యశిబిరం

కొణిజర్ల, మార్చి 19: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దరాంపురంలో బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యురాలు పీ.నాగమణి ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

రిటర్నింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మం/ మామిళ్లగూడెం/ఖమ్మం రూర్, మార్చి 19: మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూ సేకరణను, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మున్నేరుపై పోలేపల్లి వద్ద జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిర ప్రవాహం వచ్చినప్పుడు తట్టుకునేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. వెంకటేశ్వర్లు, రమేశ్, రాంప్రసాద్, క్రాంతి పాల్గొన్నారు.

బాలల సదనం తనిఖీ..

ఖమ్మంలోని బాలల సదనం భవనాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదనంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులు, ఆట పరికరాలు, అదనపు వసతుల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అధికారులు రాంగోపాల్‌రెడ్డి, కృష్ణలాల్, విష్ణువందన పాల్గొన్నారు.

హౌస్ కీపింగ్, పారిశుధ్య సేవలకు టెండర్లు

కలెక్టరేట్‌లో పారిశుధ్యం, హౌ స్కీపింగ్ సేవలు అందించేందుకు టెండర్లు దాఖలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మార్చి 27 సాయంత్రం 5 గంటల్లోపు టెండర్ల దాఖలు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు కలెక్టరేట్ పరిపాలనాధికారిని 9849906076ను సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తి సంరక్షణలో భాగస్వామ్యం కావాలి

ఖమ్మం అర్బన్, మార్చి 19: ప్రజాస్వామ్య స్ఫూర్తి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో(కెఎండీసీ)నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి ప్రతిరూపమే పార్లమెంట్ వ్యవస్థ అన్నారు. మహిళలకు ముందుగా ఓటు హక్కు కల్పించింది భారతదేశమేనని అన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి..

కొణిజర్ల, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయాందోళనలు వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. తనికెళ్ల జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. పరీక్ష రాసే విధానంపై పలు సూచనలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. పది తర్వాత ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వీ కెన్ లెర్న్ తరగతి నిర్వహణను సందర్శించి గ్రూపులవారీగా ప్రదర్శించిన కిట్లను తరగతి గదిలో పిల్లల మధ్యలో కుర్చొని ఆసక్తిగా తిలకించారు. అనంతరం తనికెళ్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్ఎం దొండపాటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రభాకర్, లక్ష్మీనారాయణ, లక్ష్మీప్రియ, ఇన్‌చార్జి తహసీల్దార్ రాము, ఎంపీడీవో రోజారాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కేటాయింపులు, సంఖ్యలు విజయాన్ని తేలేవు

'కుటుంబ సంరక్షణ బడ్జెట్‌పై చర్చ'లో ఎంపీ వద్దిరాజు

రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మార్చి 19: వైద్యారోగ్యం, కుటుంబ సంరక్షణ వంటివి భారతీయుల జీవితాల్లో అతి ముఖ్యమైన అంశాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నరు. 'వైద్యారోగ్య, కుటుంబ సంరక్షణ బడ్జెట్'పై రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులు, సంఖ్యలు మాత్రమే విజయాన్ని నిర్వచించవని అన్నారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.99,859 కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. అయితే, ఇది ప్రపంచ ప్రమాణాల కంటే తక్కువగానే ఉందని, గతంలో పలు కమిటీల సిఫార్సుల కంటే కూడా తక్కువేనని గుర్తుచేశారు.

సునీతా విలియమ్స్ ధైర్య సాహసాలు గొప్పవి

భారత సంతతి వ్యోమగామికి వద్దిరాజు, నామా శుభాకాంక్షలు

ఖమ్మం, మార్చి 19: తొమ్మిది నెలలపాటు అంతరిక్షంలో చిక్కుకొని బుధవారం భూమి మీదకు చేరుకున్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ ధైర్య సాహసాలు ఎంతో గొప్పవని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అంతరిక్ష పరిశోధన రంగంలో విశేష సేవలు అందించిన సునీతా విలియమ్స్.. క్షేమంగా భూమి మీదకు చేరుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో వారు ఆమెకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

'కవిత' ముందస్తు ఆలోచన మేరకే బీసీ బిల్లులు: ఆర్జేసీ

మాట్లాడుతున్న ఆర్‌జేసీ కృష్ణ, నాయకులు

ఖమ్మం, మార్చి 19: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముందస్తు ఆలోచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను ప్రవేశ పెట్టిందని బీసీ సంఘం నాయకుడు, బీఆర్ఎస్ నేత గుండాల కృష్ణ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో ఖమ్మంలోని ఎస్‌బిఐటీ కళాశాలలో బుధవారం నిర్వహించిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కవిత పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేర్వేరు బిల్లులను పెట్టిందని వివరించారు. సంపూర్ణంగా 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు బీసీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి : మంత్రి పొంగులేటి

ఇఫ్తార్ విందులో మంత్రి, కలెక్టర్, సీపీ

ఖమ్మం రూరల్, మార్చి 19: మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీసీవీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో సీపీ సునీల్‌దత్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రతి మసీదుకు పండుగలోపు రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేస్తామన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ముగిశాయోచ్..

ఖమ్మం అర్బన్, మార్చి19: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 5న ప్రారంభమైన పరీక్షలు బుధవారం జరిగిన కెమిస్ట్రీ, కామర్స్‌తో ముగిశాయి. బుధవారం జరిగిన పరీక్షల్లో 18,165మందికి 17,515 మంది హాజరై, 650 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. గురువారంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియనున్నాయి.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు

మామిళ్లగూడెం, మార్చి 19 : ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆశా వర్కర్ల విభాగం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో బుధవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్ధన్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు అమలు చేయకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుంటే అవసరమైతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

జిల్లాలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ పర్యటన

ఖమ్మం రూరల్, మార్చి 19: మండలంలోని పొన్నెకల్ గ్రామంలో బుధవారం రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఐడబ్ల్యూడీసీ) ఎండీ గణపతిరెడ్డి పర్యటించారు. ఇటీవల పొన్నెకల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు మరోమారు భవన నిర్మాణ స్థలాలను పరిశీలించారు.

బోనకల్లు, మార్చి 19: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌డబ్ల్యూఐడీసీ)ఎండీ గణపతిరెడ్డి గోవిందాపురం ఎల్ గ్రామంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ స్థలాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తెలంగాణ మత్స్య సంపదకు మంచి వనరు

కూసుమంచి, మార్చి 19: రాష్ట్రంలో చేపల పెంపకానికి, అమ్మకాలకు అనువైనదని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ములుగు జిల్లా రైతులకు శిక్షణలో భాగంగా చివరి రోజు బుధవారం మత్స్య రంగంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం హైదరాబాద్‌లోని మత్స్య భవన్‌కు వెళ్లి అక్కడ పరిస్థితులు, రైతులకు అందిస్తున్న సబ్సిడీలను అడిగి తెలుసుకున్నారు. పాలేరు మత్స్య శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, మార్చి19: జేఎన్‌టీయూ ప్రకటించిన బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక సాయిస్ఫూర్తి విద్యార్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, బండి అన్విద, డాక్టర్ షేక్ మీరాసాహేబ్, డాక్టర్ పాముల శేఖర్‌బాబు, షేక్ యాకుబ్, అన్ని బ్రాంచీల విభాగాధిపతులు అభినందించారు.

పది విద్యార్థులకు కలెక్టర్ లేఖ

ఖమ్మం అర్బన్, మార్చి19: పదో తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లేఖ రాశారు. పరీక్షలు ప్రారంభం నేపథ్యంలో తల్లిదండ్రులుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, విజేతగా నిలిచేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని వివరంగా పేర్కొన్నారు. ఈ లేఖలను విద్యాశాఖాధికారి ఏటూరి సోమశేఖరశర్మ ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేస్తున్నారు.

కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం రూరల్, మార్చి 19: ఇటీవల ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆళ్ల శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి శాలువాలతో సత్కరించారు. గూడ సంజీవరెడ్డి, బానోత్ కృష్ణ, రమేష్, రెడ్యానాయక్, మైబెల్లి సాహెబ్, భాస్కర్‌రావు, ఎండీ రఫీ, వీరబాబు, వీరన్న, భద్రం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ మృతి

బోనకల్లు, మార్చి 19: ప్రమాదవశాస్తూ ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని పెద్ద బీరవల్లి పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన కంచపోగు మంగరాజు(28) పాలడుగు గ్రామానికి చెందిన ఓ రైతు పత్తి చేనులో పత్తి కట్టేను తొలగిస్తుండగా ఒక్కసారిగా వెనుకకు వెళ్లే క్రమంలో ఇంజన్‌తో సహా డ్రైవరు బావిలో పడిపోవడంతో మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ ఆనంద్‌కుమార్ కేసు నమోదు చేశారు.

'పది' విద్యార్థులకు స్టడీ చైర్స్ వితరణ

రఘునాథపాలెం, మార్చి 19: ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ఖమ్మం లయన్స్ క్లబ్ సంయుక్తంగా బుధవారం పాండురంగాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు స్టడీ చైర్స్ వితరణగా అందజేశారు. స్టడీ చైర్స్ పంపిణీకి సహకారం అందించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోనకల్లు, మార్చి 19: మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని బోనకల్లు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6,7,8తో పాటు 9వ తరగతిలో సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చివరి తేదీ 31.03.2025 అని, మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పరీక్ష నిర్వహణకు సహకరించండి

బోనకల్లు, మార్చి 19: ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహణకు సహకరించాలని ఎంఈవో దామాల పుల్లయ్య కోరారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలనిచ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఉప్పలపాటి సుబ్బయ్యకు నివాళి

వేంసూరు, మార్చి 19: మండలంలోని దూళ్ల కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి సుబ్బయ్య బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సుబయ్య మృతికి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పెనుబల్లి, మార్చి 19: కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. లింగాల గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాసరావు(40) తూర్పు వైపునున్న కొత్తచెరువులో ప్రమాదవశాత్తు పడడంతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

పెనుబల్లి, మార్చి 19: కల్లూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ ని సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మీ, ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. శామ్యూల్, మునీర్‌పాషా, కిన్నెర ఆనందరావు, కంట్రోలర్ వై.వీ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ఎర్రుపాలెం, మార్చి 19: మండల కేంద్రంలోని టీజీఎస్ డబ్ల్యూఆర్‌జీఎస్ గురుకుల పాఠశాలలో బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి, హెల్త్‌అసిస్టెంట్ శాయిరెడ్డి, ఏఎన్ఎంలు స్నేహ, వసంత, అటెండర్ సుధాకర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రూ.3.61 లక్షలకు సంత వేలం

కూసుమంచి, మార్చి 19: కూసుమంచి గ్రామ పంచాయతీలో ప్రతి సోమవారం నిర్వహించే సంతను ధర్మాతండాకు చెందిన బాణోత్ నాగేశ్వరరావు రూ 3.61 లక్షలకు వైవసం చేసుకున్నారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో రామచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాళ్లబండి నీరజ తదితరులు పాల్గొన్నారు.

వైరా గ్రేట్ విజన్‌కు 11 అవార్డులు

వైరాటౌన్, మార్చి19: వైరా గ్రేట్ విజన్ క్లబ్‌కు 9 నెలల కాలంలో చేసిన సేవలకు 11 అవార్డులు వచ్చాయి. 140 సేవా కార్యక్రమాలకు రీజన్‌లో సెకండ్ బెస్ట్ క్లబ్‌గా నిలిచింది. రీజన్ 5 రీజన్ మీట్‌లో రీజన్ చైర్మన్ డిపిసి.రావు అవార్డులు అందించారు. అవార్డులు అందుకున్న వారిని ఫాస్ట్ డిస్టిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అభినందించారు.

దొడ్డా వరప్రసాద్‌కు అభినందనలు

వైరాటౌన్, మార్చి 19: తాను పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులకు సహాయాన్ని అందజేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దొడ్డా వరప్రసాదరావుకు వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. వెంకట్రావు, కిరణ్, లలిత, శ్రీనివాసరావు, వేదన, సూర్యప్రకాశరావు, నర్సింహారావు, చంద్రశేఖర్, మోహన్‌రావు, భవాని, సరస్వతి, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయాన్ని అప్పగించాలి

ఖమ్మం అర్బన్, మార్చి19: రఘునాథపాలెం ఎంఈవో కార్యాలయాన్ని ఖాళీచేసి విద్యాశాఖకు అప్పగించాలని డీఈవో సోమశేఖరశర్మ, డీఆర్‌డీవో సన్యాసయ్యకి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా..

నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 21న తెలంగాణ ఓవర్సీస్ మాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

ఎర్రుపాలెం, మార్చి 19: మండలంలోని మామునూరు ఎంపీపీఎస్ హరిజనవాడ పాఠశాలలో విద్యాధికారి మురళీమోహన్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్యాంబాబు చేతుల మీదుగా బుధవారం డిజిటల్ క్లాస్‌రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టర్ ద్వారా వీడియో, డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

జీవిత అనుభవాల్ని తెలిపేది కథ

ఖమ్మం అర్బన్, మార్చి 19: కథ అంటే జీవిత అనుభవాల్ని తెలిపేది, ఒక సంఘటన ద్వారా సందేశాన్ని ఇస్తుందని ప్రముఖ కథకులు, కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. బుధవారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో కథలోకి.. కథ వర్క్‌షాపు–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్దండి శ్రీధర్, పి రవికుమార్, సునంద, కాళోజి అవార్డు గ్రహీత సీతారాం, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాదారులు ప్రసేన్, విద్యావేత్త రవిమారుత్, శాస్త్రీ, రెడ్డి, అనురాధ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూంలో జర్నలిస్టులకు ప్రాధాన్యం

రఘునాథపాలెం, మార్చి 19: అన్ని మండలాల్లో నిర్మించి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూంలను ఆయా మండలాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు కేటాయించాలని బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేతలు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను కొణిజర్ల మండలం తనికెళ్లలో కలిసి కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సత్తుపల్లిటౌన్, మార్చి 19: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం సత్తుపల్లి తహసీల్దార్ యేగేశ్వరరావు పరిశీలించారు. కళాశాల సీడీపీవో, అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు వంద మంది విద్యార్థులు భోజనం సదుపాయం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

తిరుమలాయపాలెం, మార్చి 19: ప్రతిఒక్కరూ సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంపీడీవో షేక్ శిలార్ సాహెబ్ కోరారు. మండలంలోని పిండిప్రోలులో గౌతమి విద్యా సంస్థల అధినేత కాంపాటి బాబురావు ప్రమీల దంపతులు రూ.8లక్షల సొంత నిధులతో వైకుంఠ రథాన్ని తయారు చేయించి బుధవారం ఎంపీడీవో శిలార్ సాహెబ్ సమక్షంలో గ్రామ పంచాయతీకి అప్పగించారు.

మాఫీ చేసిన రుణం రూ.5 లక్షలు

చేయాల్సిన రుణం రూ.99 లక్షలు

పంట రుణాలు మాఫీ కాని జాబితాతో ఎర్రుపాలెంలో సీపీఎం నాయకులు, రైతుల నిరసన

పంట రుణాలు మాఫీ కాని జాబితాతో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు, రైతులు

ఎర్రుపాలెం, మార్చి 19: రుణ మాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసగించిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఎర్రుపాలెం మండల అయ్యవారిగూడెం సొసైటీలో వడ్డీ మాత్రమే మాఫీ అయి పంట రుణాలు మాఫీ కాని రైతుల జాబితాను సీపీఎం నాయకులు, రైతులు కలిసి సొసైటీ కార్యాలయం ఎదుట బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల వరకూ ఉన్న రైతుల పంట రుణమాఫీ చేస్తామన్న హామీని కాంగ్రెస్ తుంగలో తొక్కిందని విమర్శించారు. అయ్యవారిగూడెం సొసైటీలో రూ.1.04కోట్లకు పైగా పంట రుణాలను రైతులు తీసుకున్నారని అన్నారు. కానీ అందులో కేవలం రూ.5 లక్షలకు పైచిలుకు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, ఇంకా రూ.99.50 లక్షల మేర పంట రుణాలను మాఫీ చేయాల్సి ఉందని విమర్శించారు. పైగా రుణమాఫీ చేశామంటూ కొందరు రైతుల పేర్లతో ఫ్లెక్సీలు ముద్రించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేయించి పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు.